క్రైస్తవులకు క్రిస్మస్ కానుకల పంపిణీ

అన్నపురెడ్డిపల్లి : క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

చుంచుపల్లి: కేక్ కట్ చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

అశ్వారావుపేట రూరల్ : చర్చిని అలంకరిస్తున్న క్రైస్తవులు

ఇల్లెందు రూరల్ : చీరెలు పంపిణీ చేస్తున్న వల్లాల రంజిత్,స్వర్ణలత దంపతులు

చండ్రుగొండ : క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే జారే

టేకులపల్లి : విద్యుద్దీపాలతో ముస్తాబైన చర్చిలు

చండ్రుగొండ, డిసెంబర్ 24: స్థానిక రైతువేదికలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని, క్రైస్తవులకు ప్రభుత్వం తరుపున వచ్చిన దుస్తులను అందజేసి మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను, పథకాలను అమలు చేస్తామన్నారు.

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 24: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు అందజేసిన క్రిస్మస్ కానుకలను ఆదివారం స్థానిక రైతువేదికలో అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పంపిణీ చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్లు ఎమ్మెల్యేను సన్మానించారు.

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 24: క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని మండలంలోని బాలాజీనగర్‌లో మహిళలకు వార్డు సభ్యుడు రంజిత్ దంపతులు ఆదివారం చీరెలు, రూ.500 అందజేశారు.

క్రిస్మస్‌కు చర్చీలు ముస్తాబు

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 24: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో చర్చీలకు రంగులు వేసి, రంగు కాగితాలు, బెలూన్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రీస్తు జన్మదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకునేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు.

పర్ణశాల, డిసెంబర్ 24: క్రిస్మస్‌ను పురస్కరించుకుని క్రైస్తవులు పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తూ తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. చర్చిలను రంగురంగుల దీపాలతో అలంకరించారు. ఏసుక్రీస్తు చూపిన బాటను, ప్రేమను, క్షమా గుణాన్ని, అన్ని వర్గాల ప్రజలపై చూపిస్తూ ఆయన మార్గంలోనేనడవాలని క్రైస్తవ సోదరులు అందరికీ వివరిస్తూ ఆరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్ణశాల, అశ్వారావుపేటలో ముస్తాబైన చర్చిలు

సస్యరక్షణతోనే దిగుబడులు

మామిడి పంటకు అనుకూలంగా వాతావరణం
జిల్లాలో 11,324 ఎకరాల్లో తోటల సాగు
సాగుపై జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న సూచనలు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'జిల్లాలో మామిడి పంటకు ఈ సంవత్సరం అనుకూలమైన వాతావరణం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు సస్యరక్షణ చర్యలు తప్పక చేపట్టాలి' అని జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న తెలిపారు. 11,324 ఎకరాల్లో రైతులు మామిడి తోటలు సాగు చేస్తున్నారని, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట, చండ్రుగొండ, ములకలపల్లి, పాల్వంచ, టేకులపల్లి, ఇల్లెందు, జూలూరుపాడు తదితర మండలాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారని వివరించారు. ముఖ్యంగా బంగినపల్లి, దశేరి, కేసరి, హిమాయత్, రాయల్ స్పెషల్, తోతాపురి, చిన్న రసాల సాగు ఎక్కువగా చేస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాత్రిపూట 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రత ఉన్నదని, ఇలా మరో వారంపాటు ఉండవచ్చని చెప్పారు.

మొగ్గ దశలో చేపట్టాల్సిన చర్యలు

- పూ మొగ్గలు బయటకు వచ్చే వరకు నీటి తడి ఇవ్వకూడదు.
- మొగ్గ పగిలే దశలో పొటాషియం నైట్రేట్ పది గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మొగ్గ త్వరగా పగిలి పూత వచ్చే అవకాశం ఉంది.
- జూన్-జూలై నెలల్లో ఎరువులు వేయకలేక పోయిన వారు ఒక చెట్టుకు 2 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, ఒకటిన్నర కిలోల యూరియా, ఒకటిన్నర కిలోల పొటాష్ వేసుకోవాలి.
- నీటి వసతిలేని వారు పిందె దశలో ఒక శాతం యూరియా ద్రావణాన్ని 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి.
- పూత ఆలస్యమైన తోటల్లో కాయ పెరుగుదల దశలో తప్పనిసరిగా డ్రిప్ ద్వారా నీరు పెట్టుకోవాలి.
- సాగునీటి సౌకర్యం లేని వర్షాధారపు తోటల్లో పెరుగుతున్న పిందెలు, కాయలపై ఒక శాతం యూరియా ద్రావణం పిచికారీ చేయాలి.

చీడపీడల యాజమాన్యం

- ఆకులపై బూడిద మచ్చలు కనిపిస్తే ముందు జాగ్రత్త చర్యగా నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లేదా సాఫ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్లపై పిచికారీ చేయాలి.
- ఆకులపై నల్లమచ్చలు ఉంటే అవి పూ కొమ్మలకు సోకి పూత రాలిపోతుంది. అందుకే ముందుగా లీటరు నీటికి కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు కలిపి పిచికారీ చేసి పూతకు ముందే నివారించాలి.
- పూత, పిందె దశలో ఆకుమచ్చ తెగులు వ్యాప్తి చెందితే లీటరు నీటికి గ్రాము కార్బండిజమ్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.
- తేనె మంచు పురుగు ఉధృతి ఎక్కువైన ప్పుడు డైమిథోయేట్ 2 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- చెట్ల కింద పాదుల్లో పవర్ వీడర్‌తో మట్టిని బాగా కలియబెట్టాలి. దీంతో నేలలో ఉండే పిండినల్లి, పండు ఈగ కోశస్థ దశలు నాశనమవుతాయి. ఈ పురుగుల నివారణకు ఒక చెట్టు పాదుల్లో క్లోరిఫైరిపాస్ పొడి మందు సుమారు 250 గ్రాముల చొప్పున చల్లాలి.
- పిండినల్లి నేల నుంచి చెట్టుపైకి పాకకుండా చెట్టు ప్రధాన కాండంపై గ్రీజు పూసిన ప్లాస్టిక్ పేపర్లను భూమి నుంచి ఒకటిన్నర అడుగుల ఎత్తులో కాండం చుట్టూ చుట్టాలి.
- పండు ఈగ ఉధృతిని గమనించేందుకు ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలను అమర్చాలి.

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

సమస్యల పరిష్కారానికి కృషి

చర్ల, డిసెంబర్ 24: ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. చర్ల మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుబ్బంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని బీఎస్ రామయ్యనగర్ ప్రజలు ఎమ్మెల్యే వెంకట్రావుకు తమ సమస్యలను విన్నవించారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం స్థానిక నాయకుడు పొట్రు బ్రహ్మానంద రెడ్డి మనవడి అన్నప్రాశన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు సోయం రాజారావు, పోలిన లంకరాజు, ఎస్డీ అజీజ్, కాపుల కృష్ణార్జున రావు, చింతా నాగబాబు, కొటేరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి ఇస్తున్న బీఎస్ రామయ్యనగర్ వాసులు

సుధారాణిని పరామర్శించిన ఎమ్మెల్యే

భద్రాచలం, డిసెంబర్ 24: భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆదివాసీ మహిళా శక్తి నాయకురాలు కొండ్రు సుధారాణిని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాల్సిందిగా కోరారు. ఆయన వెంట ఎండీ నవాబ్, దుమ్ముగూడెం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నెం సత్యనారాయణ మూర్తి ఉన్నారు.

రామయ్యను దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి

భద్రాచలం, డిసెంబర్ 24: భద్రాచలం సీతారామచంద్రస్వామిని ఏపీలోని అమరావతి హైకోర్టు జడ్జి మండవ కిరణ్మయి కుటుంబ సమేతంగా ఆదివారం వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్థంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆమె వెంట భద్రాచలం న్యాయవాది కొడాలి శ్రీనివాసన్ తదితరులు ఉన్నారు.

రామయ్య సన్నిధిలో ఏపీ హైకోర్టు జడ్జి కిరణ్మయి

అన్ని రంగాల్లో రాణిస్తున్న దివ్యాంగులు

కొత్తగూడెం అడిషనల్ సీనియర్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్యాంశ్రీ

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 24: దివ్యాంగుల్లో దాగి ఉన్న ప్రతిభ గొప్పదని కొత్తగూడెం అడిషనల్ సీనియర్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్యాంశ్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు స్థలంలో ఆదివారం ఆమె తెలంగాణ విభిన్న ప్రతిభా వంతుల సంఘం సభ్యులు సమకూర్చిన దుస్తులు పంపిణీ చేసి మాట్లాడారు. దేవుడు దివ్యాంగులకు అవయవ లోపం ఇచ్చినా, అంతకంటే ఎక్కువ తెలివితేటలు, జ్ఞానం ఇచ్చారన్నారు. ప్రస్తుతం వారు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. టీవీపీఎస్ అధ్యక్షుడు గుండపనేని సతీశ్, సభ్యులు రవికుమార్, కల్లోజి శ్రీనివాస్, సురేష్, మేడి ప్రవీణ్‌కుమార్, జగ్గుదాస్, కళా బాబు, రమణయ్య, లింగయ్య పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న జడ్జి శ్యాంశ్రీ

వృద్ధులకు దుప్పట్లు అందజేత

వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జారే

ములకలపల్లి, డిసెంబర్ 24: లయన్స్‌క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో ములకలపల్లి సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఆవరణలో క్లబ్ ఆధ్యక్షుడు కేదారేశ్వరరావు అధ్యక్షతన వృద్ధులకు దుప్పట్లు అందించగా వాటిని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆరుద్ర సత్యనారాయణ, క్లబ్ సెక్రటరీ రేపాక ప్రసాదరావు, శిశు మందిర్ హెచ్ఎం జగన్, క్లబ్ సభ్యుడు కనకం శరత్‌కుమార్, పాఠశాల కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రభాకర్‌రావు, కోశాధికారి గాదె తిరుపతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, శెనగపాటి రవి, ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు, అధ్యక్షులు కుంజా శ్రీనివాసరావు, మడకం శిరమప్ప పాల్గొన్నారు.

ఏఎస్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో..

ఏఎస్‌డీఎస్ సంస్థ ఆధ్వర్యంలో రాబిన్ హుడ్ ఆర్మీ సహకారంతో మండలంలోని తోగ్గూడెం, చింతగుప్పు, రాచన్నగూడెం గుంపు, ఏనుగప్పయ్యనగర్, కొమరంభీం నగర్ గ్రామాల్లో 210 మంది గొత్తికోయలకు సంస్థ బాధ్యులు రాజ్‌కుమార్, బషీర్, దుర్గా ప్రసాద్‌లు దుప్పట్లు అందజేశారు.

జాతీయస్థాయి పోటీల్లో రామ్మోహనరావుకు పతకం

విజయం సాధించిన రామ్మోహనరావు

భద్రాచలం, డిసెంబర్ 24: ముంబైలో ఇటీవల జరిగిన 44వ జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ పోటీల్లో 105కిలోల విభాగంలో భద్రాచలం పట్టణానికి చెందిన విశ్రాంత ఐటీసీ ఉద్యోగి, సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన గాలి రామ్మోహనరావు పాల్గొని బంగారు పతకాన్ని సాధించాడు. ఆయనకు పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

పర్ణశాల రాముని దర్శించుకున్న ఏఎస్పీ

పర్ణశాల, డిసెంబర్ 24: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల రాముని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచవటిని సందర్శించారు. ఆలయ అధికారులు ఏఎస్పీకి, సీఐ రమేశ్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కిషోర్, ప్రసాద్, అనీల్, పోలీసు అధికారులు, సిబ్బంది రాము, శివ పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ఏఎస్పీ పరితోష్ పంకజ్

రెండోరోజుకు చేరిన రాపత్తు ఉత్సవం

భద్రాచలం, డిసెంబర్ 24: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న రాపత్తు ఉత్సవం ఆదివారం రెండో రోజుకు చేరింది. ప్రత్యేక పల్లకిలో స్వామివారిని అంబాసత్రానికి తీసుకొచ్చి తొలుత విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, శ్రీరామ అష్టోత్తర శతనామార్చన జరిపి హారతులు సమర్పించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అన్నదాన పథకానికి రూ.లక్ష వితరణ

భద్రాచలం, డిసెంబర్ 24: రామయ్య ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన గజానంద్‌రావు, గంగాదేవి దంపతులు దేవస్థానం ఈఈ రవీందర్‌రాజు, ఆలయ అధికారి లింగాల సాయిబాబాకు ఆదివారం రూ.లక్ష అందజేశారు. తొలుత వారు స్వామిని దర్శించుకున్నారు. దాతలకు అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

మంగళిగుట్టలో వైద్యశిబిరం

ములకలపల్లి, డిసెంబర్ 24: లయన్స్‌క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో శ్రీవిజయ నర్సింగ్ హోమ్ సహకారంతో మండలంలోని మంగళిగుట్టలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు శంకర్‌రావు, విజయలక్ష్మి 165 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కేదారేశ్వరరావు, కొఠారి చలపతిరావు, ఆరుద్ర సత్యనారాయణ, రేపాక ప్రసాదరావు, బైటి రాజేశ్, మడకం సిరమప్ప, కనకం శరత్, కోండ్రు జంపన్న, మడకం మణికంత, పెనుబల్లి సూర్యనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ సొమ్ము మాయం

అశ్వారావుపేట, డిసెంబర్ 24: మండలంలోని వేదాంతపురం అటవీ ప్రాంతంలో ఉన్న గంగానమ్మ తల్లి ఆలయం వద్ద శనివారం రాత్రి ఒక వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో స్థానికులు పట్టుకున్నారు. నిర్భందించేందుకు యత్నించగా ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. ఆలయ హుండీ సొమ్ము పోయిందని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ధర్మయ్యకు నివాళి

అశ్వారావుపేట/దమ్మపేట రూరల్, డిసెంబర్ 24: బీఆర్ఎస్ నాయకుడు కేశిని మధు తండ్రి ధర్మయ్య ఇటీవల మృతిచెందారు. ఆదివారం జరిగిన దశదిన కర్మకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరై ధర్మయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా శీమకుర్తి ఏకగ్రీవం

అశ్వారావుపేట, డిసెంబర్ 24: ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా శీమకుర్తి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండల అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల, పట్టణ కమిటీలను ఎన్నుకున్నారు.

గడప గడపకూ అయోధ్య అక్షింతలు

చండ్రుగొండ, డిసెంబర్ 24: జనవరి 1 నుంచి 15వరకు గడపగడపకు అయోధ్య తలంబ్రాలు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు అయోధ్య రామమందిర తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యుడు బోగి కృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో తలంబ్రాలు కలిపే కార్యక్రమాన్ని చేపట్టారు. జనవరి 22న ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోల హతం

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఘటన

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 24: రాష్ట్ర సరిహద్దు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో ఆదివారం మావోయిస్టులు, జవాన్లకు మరోసారి జరిగిన భీకర పోరులో ముగ్గురు మావోయిస్టులు హతమైనట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా-దంతెవాడ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టు పార్టీ కటేకల్యాణ్ ఏరియా కమిటీ ఉన్నదని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో దంతెవాడ డీఆర్‌జీ భద్రతా దళాలు డబ్బా కున్ను అడవుల్లో మావోయిస్టులు ఉన్న ప్రాంతంలోకి ప్రవేశించాయి. ఈ క్రమంలో జవాన్లను గమనించిన మావోయిస్టులు కాల్పులకు పాల్పడ్డారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు 30 నిమిషాలపాటు భీకర పోరు జరిగినట్లు తెలుస్తోంది. జవాన్ల ధాటికి తాళలేని మావోయిస్టులు ఆ ప్రాంతం నుంచి పారిపోయారు. కాల్పుల విరమణ తర్వాత ఘటనా స్థలంలో జవాన్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఎదురుకాల్పుల్లో మృతి చెందిన ముగ్గురు మావోయిస్టులతోపాటు ఆయుధ, వస్తు సామగ్రిని సైతం భద్రతా దళాలు స్వాధీనపరుచుకున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఉన్నతాధికారులు వెల్లడించాల్సి ఉంది.

'సైన్స్ ఫెస్టివల్'కు కాకర్ల ఉపాధ్యాయుడు

జూలూరుపాడు, డిసెంబర్ 24: కాకర్ల జడ్పీ పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బి.సంపత్‌కు జనవరి 17 నుంచి 20 వరకు హర్యానాలో జరిగే ఇండియన్ ఇంటర్ నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్)కు ఆహ్వానం అందింది. సంపత్ 'ఉపాధ్యాయ బోధనలు- మెళకువలు' అనే అంశంపై ప్రసంగించనున్నారు. ఆయనకు ఆదివారం డీఈవో వెంకటేశ్వరచారి, సైన్స్ ఆఫీసర్ చలపతి, ఎంఈవో వెంకట్,హెచ్ఎం అభినందనలు తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్రెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కార్మికులు టీబీజీకేఎస్‌ను గెలిపించండి

ప్రచారం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

జేవీఆర్‌వోసీలో ప్రచారం చేస్తున్న నాయకులు

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 24: సింగరేణి కార్మికులు ఈ నెల 27న జరిగే గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీబీజీకేఎస్‌ను గెలిపించాలని నాయకులు మోరె రమేశ్‌కుమార్, అనుదీప్, అక్బర్, కేకే శ్రీనివాస్ కోరారు. ఆదివారం వారు కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాతో పాటు ఎంసీ క్వార్టర్స్, ఎండీ క్వార్టర్స్, నర్సెస్ క్వార్టర్స్ ఏరియాకార్మికులు, కార్మిక కాలనీల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. నాయకులు కిరణ్, శివ, కరాటే శ్రీనివాస్, కిరణ్, శ్రీనివాస్, మనోజ్, వెంకట్, సూర్యనారాయణ, భాస్కర్, జైపాల్ పాల్గొన్నారు.

సత్తుపల్లి జేవీఆర్వోసీలో..

రామవరం, డిసెంబర్ 24: కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి జేవీఆర్వోసీలో ఆదివారం టీబీజీకేఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుపై ఓటు వేసి టీబీజీకేఎస్‌ను గెలిపించాలన్నారు. ప్రచారంలో 11మెన్ కమిటీ మెంబర్ కాపు కృష్ణ, రీజినల్ సెక్రటరీ వీరభద్రం కోరారు.

కమ్మసంఘం సభ్యులు ఐక్యంగా ఉండాలి

మణుగూరుటౌన్, డిసెంబర్ 24: కమ్మ మహాజన సంఘ సభ్యులందరూ ఐక్యంగా ఉండాలని, ఎవరికి ఏకష్టమొచ్చినా అండగా ఉంటామని సంఘం పెద్దలు జడ్పీటీసీ పోశం నర్సింహారావు, దండా రాధాకృష్ణ, వైస్ఎంపీపీ కేవీరావు, సంఘం గౌరవసభ్యుడు నామా వెంకటేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్యలు అన్నారు. ఆదివారం వనభోజన మహోత్సవాన్ని మణుగూరు అర్బన్ పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మణుగూరు ప్రజాప్రతినిధులుగా సేవలందించిన వారిని సన్మానించారు. కమ్యూనిటీహాలు నిర్మాణం కోసం పోశం అశోక్‌కుమార్ రూ.50,116ను ప్రకటించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, మేజీషియన్ రాము చేసిన మేజిక్ అందరినీ అలరించాయి. అనంతరం కమ్మ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వనభోజన మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న సంఘం సభ్యులు

పెద్దమ్మతల్లి ఆలయం కిటకిట

అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచ రూరల్, డిసెంబర్ 24: పెద్దమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రాకతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లా నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులతో పలువురు వాహన పూజలు చేయించుకున్నారు. తలనీలాలు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616